సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం । 5 । జూన్ । 2023



యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదాద్రి క్షేత్రానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ధర్మదర్శనానికి 3 గంటల సమయం పట్టింది. - 8లో



నంబర్ వన్ తెలంగాణ కావాలి

తెలంగాణ నంబర్ వన్ రాష్ట్రంగా ఉండాలని కోరుకుంటున్నానని బండారు దత్తాత్రేయ అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం 41°/27°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు రైతు కుటుంబాలను పరామర్శించనున్న పీవీ

భువనగిరిటౌన్ : పోలీసులు అక్రమ కేసులు బనాయించి రిమాండ్‌కు తరలించిన రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతు కుటుంబాలను సోమవారం పరామర్శించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేస్తుండగా పోలీసులు అక్రమ కేసులు పెట్టి జైలుకు తరలించడం అన్యాయం అన్నారు. రైతులు చేస్తున్న న్యాయ పోరాటానికి బీజేపీ మద్దతిస్తుందన్నారు. ఉదయం 10 గంటలకు రాయగిరిలోని రైతుల కుటుంబాలను పరామర్శించనున్నట్లు అయన పేర్కొన్నారు.

ప్రజావాణి రద్దు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యంత్రాంగం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో నిమగ్నమై ఉండడం వల్ల ప్రజావాణిని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

ఈదురు గాలులు, మోస్తరు వర్షం



నెమిల గ్రామంలో ఈదురు గాలులకు కూలిన వేపచెట్టు, ధ్వంసమైన గుడి

రాజాపేట : మండల వ్యాప్తంగా ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. నెమిల గ్రామంలో మైసమ్మ గుడి ఎదుట ఉన్న వందేళ్లకు పైబడిన వేప చెట్టు గుడిపై కూలిపోయింది. చెర్వుకట్ట భాగంలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. రఘునాథపురం, సోమారం గ్రామాల్లో దుర్గామాత పండుగ సందర్భంగా వనభోజనాల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు, కుర్చీలు గాలికి ఎగిరిపోయాయి.

చల్లబడ్డ భువనగిరి

భువనగిరి టౌన్ : పక్షం రోజులుగా ఉగ్రరూపం ప్రదర్శిస్తున్న భానుడు శాంతించాడు. ఆదివారం సాయంత్రం భువనగిరిలో ఉరుములు, మెరుపులతో పాటు మోస్తరు వర్షం పడడంతో జనం ఉపశమనం పొందారు.

మందులపై జీఎస్టీ తగ్గించాలి

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం పేదలకు వైద్యం అందుబాటులో లేకుండా చేసేలా మందులపై విధించిన జీఎస్టీని రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని దొడ్డి కొమురయ్య భవన్ తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్ యూనియన్ (టీఎంఎస్‌ఆర్‌యూ) ఉమ్మడి నల్లగొండ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను మార్పులు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని వాటి వెంటనే వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటా సుధాకర్, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు సోమ స్వామి ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ యూనిట్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుపల్లి నిరంజన్, ప్రధాన కార్యదర్శిగా రవి రావుల, కోశాధికారిగా పోలా రమేష్, కార్యవర్గ సభ్యులుగా మహేష్, అనిల్, జీవన్, జి.నరేష్‌తోపాటు 18 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

'పేట'కు పర్యావరణ అవార్డు

సూర్యాపేట: సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యావరణ అవార్డు ప్రకటించింది. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్షకు పైన జనాభా గల మున్సిపాలిటీల్లో సూర్యాపేట మున్సిపాలిటీకి ఈ అవార్డు ప్రకటించినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి సేకరించే తడి చెత్తను కంపోస్టు యార్డులో 100శాతం ఎరువుగా మార్చి రూ. 5లకు అమ్మడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్లాస్టిక్ టైల్స్, బ్రిక్స్ తయారు చేయడం, ప్రస్తుతం పట్టణంలో పొడిచెత్తను కూడా రూ. 5లకు ప్రతి వార్డులో త్రిబుల్‌ఆర్ సెంటర్‌లను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తుండడంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పేట మున్సిపల్ కమిషనర్ అవార్డు అందుకోనున్నారు.

సాగులో వృద్ధి!



చెక్‌డ్యాంల నిర్మాణంతో ఆత్మకూర్(ఎం) వద్ద సస్యశ్యామలమైన బీడు భూములు

కరువు ప్రాంతంలో పరుచుకున్న పచ్చదనం

- ఇంకా కొన్ని ప్రాజెక్టులు పెండింగ్
- మొదలుకాని 'గంధమల్ల' పనులు
- నెరవేరని ఆలేరు రెవెన్యూ డివిజన్ హామీ
- ఏర్పాటు కాని టూరిజం సర్క్యూట్



సాక్షి, యాదాద్రి : తీవ్ర కరువు పీడిత ప్రాంతాల్లో ఒకటైన ఆలేరు నియోజకవర్గంలో ఇప్పుడు ఎక్కడ చూసినా పచ్చదనం పరుచుకుంది. చెక్‌డ్యాంల నిర్మాణం, గోదావరి జలాల రాకతో బీడు భూములు సాగులోకి వచ్చాయి. ఎమ్మెల్యే గొంగిడి సునీత ఇచ్చిన హామీల్లో కొన్ని నెరవేరగా మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా రోడ్ల విస్తరణ, వంతెనలు పూర్తికావడంతో పాటు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. గంధమల్ల రిజర్వాయర్, ఆలేరు రెవెన్యూ డివిజన్ హామీలు కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆలేరు నియోజకవర్గంపై ప్రత్యేక కథనం.

అమలైన హామీలు

- ❖ 2018 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు జనగామలో ఉన్న గుండాల మండలాన్ని యాదాద్రి భువనగిరి జిల్లాలో కలిపారు.
- ❖ గుండాల, తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు గోదావరి జలాల రాక.
- ❖ భూగర్భ జలాల పెంపునకు నియోజకవర్గానికి 19 చెక్‌డ్యాంలు మంజూరు కాగా 10 పూర్తయ్యాయి.
- ❖ ఆత్మకూరు(ఎం), మోత్కూరు మండలాలకు సాగునీరు అందించే బునాదిగాని కాల్వ వినియోగంలోకి రావాల్సి ఉంది. 2006లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాల్వ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అసంపూర్తిగా ఉన్న కాల్వను ఎమ్మెల్యే గొంగిడి సునీత సొంత డబ్బులతో పూర్తి చేయించారు.
- ❖ ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 10 పడకల ఐసీయూ యూనిట్ ఏర్పాటు చేశారు.
- ❖ యాదగిరిగుట్టలో 100 పడకల ఆస్పత్రికి మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు.
- ❖ మోటకొండూర్ మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు. ఇక్కడ 24 గంటల వైద్య సేవలు అందుతున్నాయి.
- ❖ వంగపల్లి-కప్రాయపల్లి , మోత్కూర్-రాయగిరి రోడ్డు పనులు పూర్తి కావస్తున్నాయి.
- ❖ రూ.14.50 కోట్ల వ్యయంతో చేపట్టిన సుద్దాల-పల్లెపాడ్ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి.
- ❖ పల్లెపాడు పెద్దవాగుపై రూ.9 కోట్లతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యింది. దీంతో ఆత్మకూరు (ఎం) పరిసర గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గింది.
- ❖ బొమ్మలరామారం నుంచి కొండమడుగు వరకు డబుల్ రోడ్డు పూర్తయ్యింది.
- ❖ ఆలేరు, పొట్టిమర్రి రోడ్డు వయా రఘునాథపురం మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది.

అమలు కావాల్సినవి..



రిజర్వాయర్‌గా మార్చాల్సిన గంధమల్ల చెరువు

- ❖ తుర్కపల్లి మండలంలో గంధమల్ల చెరువును రిజర్వాయర్‌గా మారుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. ఈ రిజర్వాయర్ పూర్తయితే రాజాపేట, యాదగిరిగుట్ట, ఆలేరు, మోటకొండూరు మండలాలకు సాగు నీటి వసతి పెరుగుతుంది.
- ❖ ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కాలేదు. భువనగిరి డివిజన్‌లోని 5 మండలాలతో కలిపి ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కొంతకాలంగా అఖిలపక్ష నాయకులు కోరుతున్నారు.
- ❖ రఘునాథపురాన్ని మండలం చేయాలని ప్రజలు కొంతకాలంగా తమ డిమాండ్ వినిపిస్తున్నారు.
- ❖ తుర్కపల్లిలో జూనియర్ కళాశాల ఏర్పాటు, 100 పడకల ఆస్పత్రి పెండింగ్‌లోనే ఉన్నాయి.
- ❖ జనగామ జిల్లా తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి రాజాపేటకు సాగు నీరు అందిస్తామన్న హామీ నెరవేరలేదు.
- ❖ గుండాల మండలానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీళ్లందించేందుకు కాల్వ నిర్మించాల్సి ఉంది.
- ❖ రాజాపేట, కొలనుపాక, యాదగిరిగుట్ట, గంధమల్ల టూరిజం సర్కిల్ ఏర్పాటు కాలేదు.
- ❖ నూతన మండలం మోటకొండూర్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించకపోవడంతో అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

❝ఇవ్వని వాగ్దానాలూ నెరవేర్చాం



ఒక్క సాగు నీటి కాల్వ కూడా లేని ఆలేరు నియోజకవర్గంలో వరి సాగు విస్తీర్ణం లక్ష ఎకరాలకు పైగా పెరగడం రికార్డు. గంధమల్ల రిజర్వాయర్ సాంకేతిక కారణాలతో చేయలేకపోయాం. కాళేశ్వరం ప్యాకేజీ-15లో రాజాపేట మండలంలో ఎగువ ప్రాంతాలకు డిస్ట్రిబ్యూటరీ ద్వారా గోదావరి జలాలు ఇవ్వబోతున్నాం.ఆత్మకూర్(ఎం) మండలంలో బునాదిగాని కాల్వ పనులు దాదాపు పూర్తయ్యాయి. బునాదిగాని కాల్వ రీచ్ -3 ద్వారా కాళేశ్వరం నీళ్లు అందించబోతున్నాం. నవాబుపేట రిజర్వాయర్ ద్వారా గుండాల మండలంలోని అన్ని చెరువులను గోదావరి జలాలతో నింపాం. కొన్నెనుంచి బొందుగుల, పెద్దరాంచర్ల నుంచి రాఘవాపురం చెరువులకు, కొండపోచమ్మ సాగర్ నుంచి తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు గోదావరి జలాలను అందిస్తున్నాం. 19 చెక్ డ్యాంలను మంజూరు చేయించి పది పూర్తి చేశాం. ఆలేరు ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశాం. మోటకొండూరులో 30 పడకల ఆస్పత్రి నిర్మించాం. యాదగిరిగుట్టలో 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేశాం. సుద్దాల- పల్లెపహాడ్ వద్ద బిక్కేరుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాం. ఇవ్వని వాగ్దానాలు కూడా నెరవేర్చాం.

– గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే

❝హామీల అమలులో విఫలం



ఆలేరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. గంధమల్ల రిజర్వాయర్ ఊసేలేదు. ఆలేరులో రైల్వే అండర్‌పాస్ పనులు పూర్తి చేయడంలో విఫలమయ్యారు. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేకపోయారు. బస్వాపూర్ ప్రాజెక్టు ముంపు గ్రామాలైన లప్పానాయక్ తండా, చోక్లాతండాల రైతులకు ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చి రైతులకు అన్యాయం చేశారు. యాదగిరిగుట్టలో వ్యాపారులకు నష్టం కలిగించే విధంగా ప్లై ఓవర్ల నిర్మాణం, కొండపైకి ఆటోలను అనుమతించకపోవడంతో యాదగిరిగుట్ట ప్రజలు ఉపాధి కోల్పోయారు. దాతరుపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయలేకపోయారు.

– బీర్ల అయిలయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆలేరు నియోజకవర్గ ఇంచార్జి



భువనగిరిలో సురక్షా ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు. చిత్రంలో డీసీపీ రాజేశ్‌చంద్ర

ఘనంగా సురక్షా దినోత్సవం



ర్యాలీకి కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకాలతో స్వాగతం పలుకుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్



శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను సన్మానిస్తున్న కలెక్టర్, డీసీపీ, అదనపు కలెక్టర్

భువనగిరిటౌన్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీస్, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరిలోని పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు 100 మీటర్ల పొడవైన జాతీయ పతాకంతో ఆయా శాఖల సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ, పోలీసు అమరవీరుల కుటుంబాలను కలెక్టర్ పమేలా సత్పతి, డీసీపీ రాజేష్‌చంద్ర, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ తదితర అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ధనుంజయ్, కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి, సిబ్బంది పాల్గొన్నారు.



సురక్షా ర్యాలీలో పోలీస్ వాహనాలు

నేడు విద్యుత్ విజయోత్సవం

- కార్యాలయాలు, సబ్‌స్టేషన్లు విద్యుత్ దీపాలతో అలంకరణ
- తొమ్మిదేళ్ల విజయాలపై ప్రగతి నివేదిక
- ప్రజలకు వివరించనున్న అధికారులు

సాక్షి యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ విజయోత్సవం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి ఆ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ కార్యాలయాలు, సబ్ స్టేషన్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు అన్ని నియోజకవర్గాల పరిధిలో సమావేశాలు నిర్వహించనున్నారు. వినియోగదారులు, ప్రజా ప్రతినిధులు, విద్యుత్ సిబ్బంది హాజరుకానున్నారు. సమావేశం అనంతరం భోజనాలు ఏర్పాటు చేయనున్నారు.

విద్యుత్ విజయాలు తెలియజేసేలా..

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేసి తొమ్మిదేళ్లలో సాధించిన విజయాలపై ప్రజలకు వివరించనున్నారు. వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్‌తోపాటు దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి పవర్‌ప్లాంట్, తదితర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయనున్నారు. అభివృద్ధికి సంబంధించి పుస్తకాలు అందజేస్తారు.

● మెరుపుల 'యాదాద్రి'




యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం సాయంత్రం ధగధగలాడింది. ఓ వైపు ఆకాశంలో వచ్చిన మెరుపులు, మరోవైపు పసిడి వర్ణపు లైట్ల వెలుగుల్లో మెరిసిపోయింది. అద్భుత దృశ్యాలు క్షేత్రానికి వచ్చిన భక్తులు, పట్టణ ప్రజలకు కనువిందు చేశాయి. అంతేకాకుండా అప్పటి వరకు ఎండకు వేడెక్కిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడి చినుకులు రాలడంతో భక్తులు ఉపశమనం పొందారు.

- యాదగిరిగుట్ట

గ్రీన్ ఇండస్ట్రియల్‌లో మరో ప్రాజెక్టు

- 106 ఎకరాల విస్తీర్ణంలో టాయ్స్ పార్కు
- రూ.156 కోట్ల వ్యయంతో ఏర్పాటు
- 40 వేల మందికి ఉపాధి అవకాశాలు
- 6వ తేదీన భూమిపూజ చేయనున్న మంత్రి కేటీఆర్



టాయ్స్ పార్క్ ఏర్పాటు చేయనున్న స్థలం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన కామన్ ఫెసిలిటీ భవనం

చౌటుప్పల్ : మండలంలోని దండుమల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రానుంది. ఇప్పటికే వందలాది కంపెనీలతో పార్కు విస్తరించింది. సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. తాజాగా టాయ్స్ పార్కు (బొమ్మల తయారీ యూనిట్) ఏర్పాటు కానుంది. రూ.156కోట్ల వ్యయంతో టాయ్స్ పార్కు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం టీఎస్ఐఐసీ 106 ఎకరాలు కేటాయించింది. ఈ భూమిని 196 ప్లాట్లుగా విభజించి యూనిట్లు నెలకొల్పనున్నారు. ఇది పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 40వేల మందికి ఉపాధి లభించనుంది.

విదేశాలకు ఉత్పత్తుల ఎగుమతి

టాయ్స్ పార్కులో తయారైన బొమ్మలను తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలు, ప్రపంచ దేశాలకు ఎగుమతి చేయనున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఉడెన్, సాఫ్ట్, ఎలక్ట్రానిక్, రోబోటిక్, ప్లాస్టిక్, నిర్మల్, బొంతపల్లి బొమ్మలు, అన్ని రకాల టెడ్డీ బియర్స్, మట్టిబొమ్మలు ఇక్కడ తయారవుతాయి. అంతేకాకుండా చిన్నారులకు విద్యాబోధనలో ఉపయోగపడే బొమ్మలు,సెల్‌ఫోన్‌కు అడిక్ట్ అవుతున్న చిన్నారులను సెల్‌ఫోన్ వ్యాపకానికి దూరం చేసే బొమ్మలను సైతం తయారు చేయనున్నారు. ఉత్పత్తులకు అవసరమైన ముడి సరుకును పూర్తిగా తెలంగాణ రాష్ట్రం నుంచే సేకరించాలని నిర్ణయించారు.

భూమి పూజ చేయనున్న మంత్రి కేటీఆర్

టాయ్స్‌పార్కుకు ఈనెల 6న పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ భూమి పూజ చేయనున్నారు. 12 మంది యూనిట్‌దారులకు పట్టాలు, అనుమతి పత్రాలు అందజేస్తారు. అలాగే కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను మంత్రి ప్రారంభిస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మంత్రి పార్కులోనే గడపనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

మంత్రి కేటీఆర్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఆదివారం ఇండస్ట్రియల్ పార్కును సందర్శించి ఏర్పాట్లపై సమీక్షించారు. మంత్రి పర్యటన షెడ్యూల్, బందోబస్తు, ఇతర అంశాలపై టీఎస్ఐఐసీ, పోలీసులు, టిఫ్ బృందంతో చర్చించారు. అదే విధంగా టీఎస్ఐఐసీ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధి కారులకు సూచనలు చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, తెలంగాణ పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు కొండవీటి సుధీర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మిరుపాల గోపాల్‌రావు, టీఎస్ఐఐ సీ సీఈఓ మధుసూదన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ శ్యాంసుందర్, జోనల్ మేనేజర్ ఓవీటీ.శారద, నోడల్ ఆఫీసర్ ఎం.శ్రీహరిరెడ్డి, తదితరులు ఉన్నారు.

ముస్తాబైన కామన్ ఫెసిలిటీ సెంటర్

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో రూ.41కోట్ల వ్యయంతో నిర్మించిన కామన్ ఫెసిలిటీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ భవనం అందుబాటులోకి వస్తే బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. ప్రధానంగా వృత్తి నైపుణ్య కేంద్రం, ఆసుపత్రి, వృత్తి శిక్షణ కేంద్రం, 400మంది సమావేశమయ్యే సమావేశ మందిరం (ఆడిటోరియం), బ్యాంకులు, పోస్టాఫీస్, ఏటీఎం కేంద్రాలు, ఫుడ్‌కోర్టు, రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లు, వివిధ రకాల షోరూంలు, బాంక్వెట్ హాళ్లు, గెస్టహౌజ్‌లు, దేశ, విదేశాల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చే వ్యక్తులకు వసతిగృహాలు, ప్రభుత్వం నుంచి లైసెన్సులు, ఇతర అనుమతులు, హెల్ప్‌డెస్క్, సూపర్ మార్కెట్లు, ప్రొఫెషనల్ సర్వీసులు వంటి సేవలు అందనున్నాయి.

యాదాద్రిలో శాస్త్రోక్త పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరచిన ఆచార్యులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం చేశారు. ఆ తర్వాత స్వామివారికి సహస్రనామార్చన చేపట్టి తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు జరిపించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

క్లుప్తంగా

16 గోవులు పట్టివేత



పట్టుబడిన గోవులు

చింతపల్లి : కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్‌కు గగోవులను తరలిస్తున్న మూడు టాటా ఏస్ వాహనాలను భజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం కొండమల్లేపల్లి సంత నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ వ్యక్తులు మూడు టాటా ఏస్ వాహనాల్లో 16 గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన గోవులను రంగారెడ్డి జిల్లా వెల్దండ మండలం గోశాలకు తరలించి, సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

జనంపల్లిలో వ్యవసాయ మోటార్లు దగ్ధం

రామన్నపేట : ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో వ్యవసాయ మోటార్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన ఆదివారం జనంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జనంపల్లి గ్రామంలో మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో పండుగ చినరాములు, గోపగోని శంకరయ్య, కైరంకొండ శ్రవణ్‌కుమార్‌లకు చెందిన వ్యవసాయ మోటార్లు, కేబుల్‌వైర్లు, స్టార్టర్లు, 300 కట్టల గడ్డిమోపులు దగ్ధమయ్యాయి. సుమారు నాలుగు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. బాధితులను ఆదుకోవాలని సర్పంచ్ రేఖ యాదయ్య ప్రభుత్వాన్ని కోరారు.

కుక్కల దాడిలో ఇద్దరు మహిళలకు గాయాలు

యాదగిరిగుట్ట: కుక్కల దాడిలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన సుజాత, మంగమ్మలు రోడ్డుపై వెళ్తున్నారు. ఈ సమయంలో అక్కడే కాపుకాసిన కుక్కలు ఒక్క సారిగా వీరిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు చూసి వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

ఒకరి దుర్మరణం

నల్లగొండ క్రైం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణ శివారు ఆర్జాలబావి గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కావేరి ట్రావెల్ బస్సు ఆర్జాలబావి శివారులో ముందుకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న భానుచంద్ర (38)కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

డిండి: రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని శాసన మండలి చైర్మన్‌గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల ప్రజల సాగు, తాగు నీటి సమస్య శాశ్వతంగా దూరం చేయాలనే లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ డిండి ఎత్తిపోతల పథకం ప్రారంభించారని తెలిపారు. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.6వేల కోట్లు కేటాయించగా ఇప్పటి వరకు రూ.2880 కోట్లు రిజర్వాయర్ల నిర్మాణానికి ఖర్చు చేసిందన్నారు. డిండి ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసే తూములకు నూతన తలుపుల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ 44 కిలోమీటర్ల దూరానికి గాను ఇప్పటి వరకు 35 కిలోమీటర్ల వరకు పనులు పూర్తయ్యాయని, సాంకేతిక సమస్య వలన 9 కిలోమీటర్ల పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 65 లక్షల టన్నుల వరిధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు గతేడాది రూ.10 కోట్లు ఖర్చు చేస్తే ఈ ఏడాది రూ.12 వేల కోట్లు కేటాయించిన ఘనత ఒక్క సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఉదయ సముద్రం ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాల సాగుకు నీరందించేందుకు ట్రయల్‌రన్ పూర్తయిందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే పెండింగ్ ప్రాజెక్టుల పనులు పూర్తవుతాయన్నారు. కృష్ణా జలాల పంపిణీ విషయంలో తెలంగాణ వాటా ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం తేల్చలేదని ఆరోపించారు. అనంతరం మండలంలోని టి.గౌరారంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజీనేని వెంకటేశ్వర రావు తండ్రి లక్ష్మణ్‌రావు దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో యాదగిరిరావు, దామోదర్‌రావు, దేవేందర్‌నాయక్, వంకట్‌రెడ్డి, రాఘవేంద్రరావు, దశరథరెడ్డి, జాన్‌యాదవ్, రాములు, తిర్పతయ్య, లక్ష్మారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరు మృతి

నార్కట్‌పల్లి : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా ఏలుర్తి మండలం, కల్లకుంట గ్రామానికి చెందిన రాగాల చంద్రయ్య (58) 20ఏళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం కుటుంబంతో సహా మండలంలోని చెరువుగట్టు గ్రామానికి వలస వచ్చాడు. ఇక్కడే భూములను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, చంద్రయ్య ఈ నెల 2వ తేదీన గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చంద్రయ్య చెరువులోకి దిగి చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులోని బురదలో కూరుకుపోయి మృతిచెందాడు. మృతదేహం చెరువులో తేలియాడుతుండడంతో ఆదివారం స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మృతదేహాన్ని వెలికి తీసిన అనంతరం మృతుడి సోదరుడు రాగాల బ్రహ్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

బెటాలియన్‌లో ఓపెన్ హౌజ్



ఆయుధాలను పరిశీలిస్తున్న విద్యార్థినులు

నల్లగొండ క్రైం : సురక్ష దినోత్సవంలో భాగంగా ఆదివారం అన్నెపర్తి బెటాలియన్‌లో ఓపెన్ హౌజ్ నిర్వహించి విద్యార్థులకు పోలీస్ శాఖ ద్వారా అందిస్తున్న సేవలు తెలియజేశారు. ప్రజా రక్షణ కోసం ప్రాణ త్యాగానికైనా పోలీసులు వెనకడారని కమాండెంట్ సాంభయ్య, అడిషనల్ కమాండెంట్ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమాండెంట్ తిరుపతి, వెంకన్న , రాజు, సైదులు పాల్గొన్నారు.

నంబర్ వన్ తెలంగాణ కావాలి



అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్, జిట్టా తదితరులు

- ఇందుకోసం మరో ఉద్యమం అవసరం
- హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

సాక్షి, యాదాద్రి : తెలంగాణ రాష్ట్రం నబర్ వన్‌గా ఉండాలని కోరుకుంటున్నానని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం యాదాద్రి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అలయ్–బలయ్, మాట, ఆట, పాట, ముచ్చట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేలాది మంది ఆత్మ బలిదానాలతో సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రాన్ని స్వచ్ఛమైన తెలంగాణగా తీర్చిదిద్దాలని, అందుకోసం ఉద్యమకారులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏ ఒక్క వ్యక్తితో రాలేదని, అమరవీరుల రక్తంతో, ఉద్యమకారుల ఆటపాటలతో వచ్చిందన్నారు. ఉద్యోగాలు రాక యువత నిరాశతో ఉందన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మాట కంటే పాట బాగా పనిచేసింది అన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ ఉద్యమాలు ధూమ్‌ధాం కార్యక్రమంతో ప్రజలలో చైతన్యం తీసుకువచ్చింది అన్నారు. సాయుధ రైతాంగ పోరాటానికి చైతన్యం అందించింది పాటలే అన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు ఎలాంటి మంచి జరగలేదన్నారు. కేసీఆర్ అన్యాయాలపై మరో ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరిలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి తెలంగాణ ఉద్యమకారుల తోపాటు నలుగురు మహిళలు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సోనియా గాంధీ, బీజేపీ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్, రాజ్యసభ స్పీకర్ మీరా కుమార్,తెలంగాణ గాన కోకిల బెల్లి లలిత పాత్ర ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, బండ్రు శోభారాణి మాట్లాడుతూ స్వరాష్ట్ర ప్రజలు ఆశించిన కలలు కలగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న బృందం పాడిన పాటలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలేరు జెడ్పీ ఫ్లోర్ లీడర్ నగేష్, రాణి రుద్రమదేవి, బట్టు రామచంద్రయ్య, భువనగిరి శ్రీనివాస్, బెల్లి చంద్రశేఖర్, జగన్మోహన్ రెడ్డి, పటోళ్ల శ్యామ్ శ్యామ్ గౌడ్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

చౌటుప్పల్ : వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. చౌటుప్పల్, త్రిపురారం మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనలపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌటుప్పల్ మండలం కుంట్లగూడెం గ్రామానికి చెందిన అయిటిపాముల ప్రసాద్(19) పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఇతని తండ్రి కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ముగ్గురు కుమార్తెల పెళ్లిళ్లవగా ఇంట్లో తల్లి, కుమారుడు మాత్రమే ఉంటారు. తల్లి ధనమ్మ గత నెల 29న నల్లగొండలోని తన రెండవ కుమార్తె ఇంటికి వెళ్లింది. అదే నెల 31న కుమారుడితో ఫోన్‌లో మాట్లాడింది. ఈనెల 1న మరోసారి ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయలేదు. ఈనెల 3న ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో పక్కింటి మహిళ గుర్తించి నల్లగొండలో ఉన్న ధనమ్మకు ఫోన్‌లో చెప్పింది. ఆ క్రమంలో గ్రామానికి చేరుకున్న ఆమెతో పాటు మరికొంత మంది కలిసి డోర్ పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా దూలానికి ఉరివేసుకున్న ప్రసాద్ వేలాడుతూ కన్పించాడు. మృతుడి తల్లి ధనమ్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని మహిళ..

త్రిపురారం : నిడమనూరు మండలంలోని సూరెపల్లి గ్రామానికి చెందిన నాంపల్లి ఏడుకొండలు త్రిపురారం మండల కేంద్రంలోని జంగాల కాలనీలో ఇల్లు కొనుక్కొని మాడుగులపల్లి మండలంలోని విశాఖ పరిశ్రమలో రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. చందంపేట మండలంలోని తెల్‌దేవర్‌పల్లి గ్రామానికి చెందిన రాసనూరు గురువయ్య వజ్రమ్మల కూతురు రేణుకను నాలుగు సంవత్సరాల క్రితం వివాహ చేసుకున్నాడు. అయితే ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఏడుకొండలు కుటుంబ అవసరాల నిమిత్తం బజారుకు వెళ్లి వచ్చాడు. అప్పటికే రేణుక కనిపించలేదు. రేణుక తల్లి వజ్రమ్మ శనివారం కూతురు వద్దకు వచ్చి ఉంది. దీంతో బజారు నుంచి ఇంటికి వచ్చిన ఏడుకొండలు రేణుక ఎక్కడ ఉంది అని వజ్రమ్మను అడగడంతో తనకు కనిపించలేదని ఇద్దరు కలిసి కిటికిలోంచి ఇంటిలోపలికి చూశారు. అప్పటికే రేణుక ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించింది. వెంటనే తలుపులు పగలగొట్టి రేణుకను మిర్యాలగూడలో ఓ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి 3 సంవత్సరాల కూతురు ఉంది. రేణుక తండ్రి రాసనూరి గురువయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామయ్య తెలిపారు.

పురుగుల మందు తాగి రైతు..



జయప్రకాష్ (ఫైల్)

శాలిగౌరారం: పురుగుల మందు తాగి ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలో జరిగింది. ఎస్ఐ సతీష్ ఆదివారం తెలిపిన వివరాలున్నాయి. మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన గిరగాని జయప్రకాష్(45) తనకున్న నాలుగు ఎకరాల భూమితో పాటు గ్రామానికి చెందిన మరో రైతుకు చెందిన ఎనిమిది ఎకరాల భూమిని కౌలుకు తీసుకోని పత్తి, వరి పంటలను సాగు చేస్తున్నాడు. కాగా పంటల సాగుకు సుమారుగా పది లక్షల రూపాయలను అప్పులు చేసి పెట్టుబడి పెట్టాడు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటల దెబ్బతిని దిగుబడి రాకపోవటంతో పూర్తిగా పంట నష్టం వచ్చి ఆర్థికంగా దెబ్బతిన్నాడు. దీంతో అనునిత్యం అప్పుల విషయంపై కుటుంబీకులతో మదనపడుతూ మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కొంత సమయం తరువాత గుర్తించిన కుటుంబసభ్యులు జయప్రకాష్‌ను గ్రామస్తుల సహాయంతో సూర్యాపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యంగాను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటుకు తరలించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిత్తలూరులో విషాదం

చిత్తలూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక నాయకుడు, రైతు గిరగాని జయప్రకాష్ మృతితో విషాదం అలుముకుంది. ఆదివారం సాయంత్రం గ్రామంలో జయప్రకాష్ అంత్యక్రియలు జరగగా భారీ సంఖ్యలో గ్రామస్తులతో పాటు, పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మృతదేహానికి రాష్ట్ర గిడ్డంకుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్, జెడ్పీటీసీ సభ్యుడు ఎర్ర రణీల, సర్పంచ్ మామిడికాయల హేమ, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి ప్రమీల తదితరులు జయప్రకాష్ మృతదేహానికి నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

యాదాద్రిలో భక్తుల రద్దీ

- స్వామి దర్శనానికి మూడు గంటల సమయం
- వివిధ పూజలతో రూ.54.84 లక్షల ఆదాయం



ఆలయ పరిసరాల్లో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులతో పాటు ఆదివారం కలిసి రావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధికంగా వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, ఆలయ మాఢ వీధుల్లో భక్తులు అధికంగా కనిపించారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి 45 నిమిషాల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి రూ.54,84,992 నిత్య ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రధాన బుకింగ్‌తో రూ.6,85,650, కైంకర్యాలతో రూ.1,700, సుప్రభాతంతో రూ.5,400, బ్రేక్ దర్శనాలతో రూ.4,11,600, వ్రతాలతో రూ.3,56,800, వాహన పూజలతో రూ.16,600, వీఐపీ దర్శనాలతో రూ.5,25,000, ప్రచారశాఖతో రూ.31,700, పాతగుట్ట ఆలయంతో రూ.92,420, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6,50,000, యాదరుషి నిలయంతో రూ.2,12,378, సువర్ణ పుష్పార్చనతో రూ.1,70,464, శివాలయంతో రూ.21,200, పుష్కరిణితో రూ.1,500, ప్రసాద విక్రయశాలతో రూ.20,67,200, శాశ్వత పూజలతో రూ.15,000, కల్యాణకట్టతో రూ.1,82,500, అన్నదానంతో రూ.37,880 ఆదాయం వచ్చినట్లు వివరించారు.

స్వామివారిని దర్శించుకున్న అన్నపూర్ణ

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ అన్నపూర్ణ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు ఆమెకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న అన్నపూర్ణ, కుటుంబ సభ్యులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేశారు.



స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరి మృతి



వెంకటయ్య (ఫైల్)

నార్కట్‌పల్లి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండలం వెల్లి గ్రామానికి చెందిన మరెడ్డి రాజేష్ (22), గోగుల సాయిరామ్ (22), ఈలి వరప్రసాద్ నర్సరీ మొక్కల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో భాగంగా ట్రాలీ ఆటోలో ఐరన్ సెంట్రింగ్ లోడ్‌తో శనివారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆటో వెనుక టైరు పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న రాజేష్, సాయిరామ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా వరప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ద్రాక్షారామానికి తరలించగా అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

కారు ఢీకొన్న ప్రమాదంలో..

చింతపల్లి : చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామానికి చెందిన పులకరం వెంకటయ్య(40) శుక్రవారం మాల్ నుంచి చింతపల్లి వైపు బైక్‌పై వస్తుండగా ఎదురుగా కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

వైద్యం వికటించి మహిళ మృతి?

నేలకొండపల్లి: వైద్యం కోసం వస్తే ఓ ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్లు వికటించటంతో మహిళ మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్‌కు చెందిన కరిశ పద్మ(57) కీళ్ల నొప్పులు ఉండటంతో ఆదివారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లిలో ఓ గ్రామీణ వైద్యుడి వద్దకు వచ్చింది. దీంతో నొప్పి తగ్గేందుకు ఆయన ఓ ఇంజక్షన్ ఇవ్వగా, మంటగా ఉందని, దద్దుర్లు వస్తున్నాయని చెప్పడంతో మరో ఇంజక్షన్ ఇచ్చాడు. కాసేపటికి పద్మ గుండెలో ఇబ్బందిగా ఉందని, శ్వాస తీసుకోవటం కష్టంగా మారిందని చెప్పగా ఇంకో ఇంజక్షన్ ఇచ్చాడు. చివరకు ఆమె పరిస్థితి విషమించటంతో నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు పెద్దసంఖ్యలో చేరుకుని మృతదేహంతో పోలీస్‌స్టేషన్ సమీపానికి వచ్చారు. ఈక్రమంలెఓ సదరు ఆర్ఎంపీతో పెద్దలు చర్చించినట్లు సమాచారం. అనంతరం కూసుమంచి సీఐ జితేందర్, ఎస్సై జి.స్రవంతి వివరాలు ఆరా తీసి మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. కాగా, తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందిందని పద్మ కుమారుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వృద్ధురాలు అదృశ్యం

మిర్యాలగూడ అర్బన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైంది. వన్‌టౌన్ ఎస్ శ్రీనునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన ఎలిమినేటి దర్గా గత నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో త మకు తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీరవెల్లి వారి బలగం



ఆత్మీయ సమ్మేళనంలో బీరవెల్లి కుటుంబ సభ్యులు

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్‌లో బీరవెల్లి వారి ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. బీరవోలు, బీరెల్లి, బీరవెల్లి ఇంటి పేరు గల కుటుంబాల వారు సుమారు 200 మంది ఒకే వేదికపై చేరి తమ వంశానికి చెందిన జ్ఞాపకాలను, చరిత్రను నెమరు వేసుకున్నారు. ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలనుంచి ఈ కుటుంబాలకు సంబంధించిన వారు హాజరయ్యారు. ప్రముఖ యోగా గురువు బీరెల్లి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిచయంతో పాటు పలు పదవుల్లోనూ, ఉద్యోగాల్లో ఉన్న వారిని ఘనంగా సన్మానించుకున్నారు. కార్యక్రమంలో బీరెల్లి సుధాకర్ రెడ్డి, బీరెల్లి రాంరెడ్డి, బీరవెల్లి శ్రీనివాసరెడ్డి, బీరవోలు శేఖర్ రెడ్డి, బీరవోలు వెంకట్రాం రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు

వ్యవసాయంలో 'వేప' ప్రాధాన్యం

- పంటలపై వేప కషాయం పిచికారీ చేస్తే పురుగు మందు ఖర్చులు ఆదా
- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు



పాడి పంట

నడిగూడెం: వేపలో ఔషధ గుణాలతో పాటు పర్యావరణానికి మేలు చేసే సుగుణాలున్నాయి. వేప క్రిమికీటక నాశన గుణాలు కలిగి ఉండడంతో దీని వినియోగం పెరిగింది. ప్రస్తుతం వేప కాయలు పండ్ల దశలో ఉన్నాయి. వాటిని ఇప్పటి నుంచే సేకరించుకొని, నిల్వ చేసుకోవాలి. ఎండబెట్టి, ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగు చేసే పంటలపై వేపగింజలతో చేసిన కషాయాలను పిచికారీ చేస్తే పురుగు మందుల ఖర్చులు పూర్తిగా ఆదా అవుతాయి. వేప సంబంధ పురుగు మందులు మార్కెట్‌లో లభ్యమవుతున్నా రైతు తమ ఇంటి వద్దే తక్కువ ఖర్చుతో తయారు చేసుకొనే విధానాన్ని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు వివరించారు.

వేపగింజల కషాయం తయారీ ఇలా..

పది కిలోల ఎండిన గింజలను నూనె రాకుండా కొద్దిగా దంచాలి. గింజలపై పొట్టును వేరు చేసి, ఎరువుగా కూడా వాడుకోవచ్చు. దంచిన వేపగింజల పొడిని పలుచని వస్త్రంలో లేదా పల్చని గోనె సంచిలో మూటకట్టి లీటరు నీటిలో 12గంటలు నానబెట్టాలి. తర్వాత మూటను బాగా పిండి వడపోయాలి. వడపోసిన ద్రావణానికి ఒక గ్రాము సరుపు పొడి కలిపి పంటపై పిచికారీ చేయాలి.

వేప ఆకుల కషాయం..

ఐదు కిలోల పచ్చి వేప ఆకులను 5 లీటర్ల నీటిలో 12 గంటలు నానబెట్టాలి. నానిన ఆకులను నూరి నీటిలో కలిపి వడపోసిన రసాన్ని వేరు చేయాలి. ఈ రసానికి సరుపు పొడి కలపాలి. ఎకరం పంటకు 40 కిలోల వేప ఆకు సరిపోతుంది.

వేప నూనె పిచికారీ..

లీటరు నీటిలో 5 మి.లీ. వేప నూనె ఒక గ్రాము సరుపు పొడిని వేసి బాగా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని పంటపై పిచికారీ చేసే ముందు తయారు చేసుకోవాలి. పంటకు నష్టం చేసే పురుగులు ఆకుల అడుగు భాగాన గుడ్లు పెడతాయి. కనుక ఆకులు బాగా తడిసేలా పూర్తిగా పిచికారీ చేయాలి.

ఆహార ధాన్యాల నిల్వలో వేప ఉపయోగం..

వేప ఆకుల ముద్ద, ఆవు పేడ కలిపి నిల్వ ఉంచే గోదాములను తొట్టెలను శుభ్రం చేసి పురుగుల నుంచి ఆహార ధాన్యాలను కాపాడుకోవచ్చు. పప్పు ధాన్యాలలో ఎండిన వేపాకుల పొడి, గింజల పొడి లేదా నూనె కలిపి పురుగులు సోకకుండా నాలుగు నెలల పాటు భద్రపరచవచ్చు.

పంటలకు ఎరువుగా..

పచ్చి ఆకు ఎరువుగానే కాక పురుగులు ఆశించకుండా పనిచేస్తుంది. వేప పిండిని ఎరువుగా వాడినప్పుడు అది వేళ్లను చెద పురుగులను, నులిపురుగుల నుంచి రక్షిస్తుంది. వేప పిండి పొలంలో వేయడంతో పంటలకు మేలు చేసే పురుగుల సంఖ్య పెరుగుతుంది. నేల స్వభావం కూడా అభివృద్ధి చెందుతుంది.